# గజోత్తమలాభాం

-రాళ్లబండి చిత్తరంజనదాస్
(14)



ఓ పెద్ద మహారాజుగారికి గొప్ప జబ్బుచేసింది. అనేకమంది వైద్యులు జబ్బు కుదర్చలేక విసుగెత్తిపోయారు. ధన్వంతరులు శిరోమణులు కూడ చేతకాదని నిరూపించుకున్నారు. రాజవైద్యులకి అసలది ఏ జబ్బో తలాతోకా అందింది కాదు. ఇంక రాజుగారికి, రాజుగారి బంధుమిత్రాదులకీ బెంగ లావైపోయింది. రోగం కుదిరే మార్గం కోసం వెతుకుతున్నారు.

రాజుగారి జబ్బు పోగొట్టేవారికి-వారి అంబారీ ఏనుగంత బరువుగల ధనాన్ని ఇస్తారు - అని ఊరూరా దేశదేశాలా చాటించారు...

ఎందరెందరో భిషగర్వులు వచ్చారు; బిక్కమొహాలతో వెళ్ళిపోయారు. పతకాలు, ప్రశంసలూ, పొందిన వైద్యరత్నాలు కూడా వచ్చినదోవ పట్టారు. రాజుగారికి జబ్బుకన్నా బెంగే ఎక్కువైపోయింది!

ఆఖరికి ఓ పెద్ద పర్వతప్రాంతం లోంచి ఓ సిద్ధుడువచ్చి, రాజుగారి జబ్బును అవలీలగా మాయం చేశాడు. సాక్షాత్తు అతను పరమేశ్వరుడే అని రాజ్యం అంతా అతని పాదాలకు నమస్కరించింది - రాజు తన సంతోషాన్ని వెలిబుచ్చి ఏనుగెత్తు ధనం స్వీకరించమని సిద్ధుణ్ణి ప్రార్థించాడు—

"గురువాజ్ఞలేదు, నేను డబ్బు పుచ్చుకోను" - అన్నాడు సిద్ధుడు!

"ప్రాణదానం చేసిన మీ ఋణం ఎలా తీర్చుకోవడం?" అని రాజు ధనాన్ని తీసుకోమని ప్రాధేయ పడ్డాడు...

"నా కివ్వదలచుకున్న ధనాన్ని విరివిగా బీదలకు పంచి యిచ్చేయ్"- అని సిద్ధుడు చెప్పి వెళ్ళిపోయాడు-

"ఖజానా ఖాళీచేసి ఏనుగెత్తు ధనం - జరూర్‌గా తేవాలి" అని హుకుం జారీచేశాడు రాజు.

అక్కడే వచ్చింది చిక్కు...

ఏనుగెత్తు ధనం! అంటే ఏనుగు ఎంత బరువు తూగుతుందో అంత బరువుగల ధనం! కాని ఏనుగును తూచడం ఎలా? ఏ త్రాసులో ఏనుగు పడుతుంది? ఏ కాటా గొలుసులు ఏనుక్కి ఆగుతాయి? రాజుకు మళ్లా మతిపోయింది. ఏమిటి ఉపాయం?

ఏనుగును ఎలాతూచడం? అన్న సమస్య లావైపోయింది ఆ రాజ్యంలో.

"ఏనుగును తూచేవిధానం కని పెట్టినవారికి వెయ్యివరహాల బహుమానం - " అని మళ్లా చాటింపు.



ఒప్పులకుప్ప ఒయ్యారిభామ

—వి. సీతాకుమారి (15 సం॥), వెల్లటూరు.

ఈ చాటింపు ఒక పన్నెండేండ్ల బీద అబ్బాయి విన్నాడు. విన్న దగ్గరనుంచి ఈ "గజతులాభారం" విషయం ఆలోచించడం మొదలెట్టాడు. ఏమీ పాలుపోయింది కాదు బాలలూ...! పోనీ మీరు చెప్పుకోండి చూద్దాం -!... ఊఁహుఁ...! చెప్పలేరుకదూ? మరి వినండి -

ఆఖరికి ఆ అబ్బాయి కనిపెట్టాడు ఉపాయం! ఓ పెద్ద - లోతైన చెరువులో ... వెడల్పు, లావు, గల ఓ పడవ తేలించాలి. దానిమీద దళసరి బల్లచెక్కగాని, ఇనపరేకుగాని వెయ్యాలి. ఆ పడవను వడ్డునవుంచి, ఏనుగును మెల్లగా దానిమీద కెక్కించాలి. అప్పుడు ఆ పడవ నీటిలో కొంతవరకు మునుగుతుంది కదా! అది ఎంతవరకు మునిగిందో, అక్కడో ఆనవాలు పెట్టుకోవాలి.. తర్వాత ఏనుగును దింపెయ్యగానే పడవ యధాప్రకారం తేలిపోతుంది. ఇప్పుడు దానినిండా డబ్బు వెయ్యాలి. ఇదివరకుపెట్టిన "ఆనవాలు"వరకూ మునిగేదాకా...!

అయిందికదూ ఏనుగెత్తుధనం - డబ్బంతా బీదవాళ్లకిఅందిపోయింది. రాజు హృదయం ఆనందంతో నిండిపోయింది...

అబ్బాయికి వెయ్యివరహాలబహుమానం ముట్టింది. అందుకే మన పెద్దవాళ్లు అంటారు...ఏమిటో తెలుసునా ?... "ఉపాయం లేనివాణ్ణి ఊళ్లోంచి వెళ్లగొట్టాలి"-అని-! ★

